## అభివృద్ధిని చూసి ఓటెయ్యాలి

- ఎంపీపీ గంగం స్వరూపారాణి, జడ్పీటీసీ గట్ల మీనయ్య



రుద్రంగిలో చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకులు

రుద్రంగి, అక్టోబర్ 13: బంగారు తెలంగాణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని, గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూసి వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ గంగం స్వరూపారాణి, జడ్పీటీసీ గట్ల మీనయ్య కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలో నాయకులతో కలిసి చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చెర్మన్ కంటె రెడ్డి, కోఆప్షన్ సభ్యులు జమీల బేగం, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు దయ్యాల కమలాకర్, నాయకులు గంగం మహేశ్, మంచె రాజేశం, కొమురె శంకర్, కేసీరెడ్డి నర్సరెడ్డి, మడిశెట్టి ఆనందం, దాసరి గంగారాజం, నాగులపెల్లి రవి, కాదాసు లక్ష్మణ్, బాబా, మంచె రమేశ్, తలారి నర్సయ్య, నారాయణ, పోగుల నర్సయ్య, ఉప్పులూటి గణేశ్, గడ్డం మహేందర్, చంద్రయ్య, పెద్దులు, గంగారెడ్డి, రాజేశం, మోహన్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో కోనరావుపేట మండల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

## మల్కపేట బిడ్డగా మీ ముందుకు వస్తున్నా..

- ఒక్కసారి అవకాశం ఇవ్వండి
- మూడేండ్లలోపు సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- కోనరావుపేట మండల ముఖ్య నేతలతో సమావేశం

వేములవాడ, అక్టోబర్ 13: మల్కపేట బిడ్డగా సేవ చేయాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మీ మందుకు వస్తున్నా.. ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే.. మూడేండ్లలోపు మండలంలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తానని వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు స్పష్టం చేశారు. మల్కపేట రిజర్వాయర్‌తో కోనరావుపేట మండలాన్ని సస్యశ్యామలం చేస్తానని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మిగతా పార్టీలవి కళ్లబొల్లి మాటలు, గ్యారెంటీ, వారంటీ లేని పథకాలని ఎద్దేవా చేశారు. వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో కోనరావుపేట మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య అధ్యక్షతన శుక్రవారం ఆయన బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మనకు మనమే పోటీ అని.. మనకు ఎవరూ సాటిలేరన్నారు. గ్రామానికి గ్రామానికీ మధ్య, బూత్‌కు బూత్‌కి మధ్య మాత్రమే పోటీ ఉంటుందని, బీఆర్ఎస్‌కు ఇతర పార్టీలతో ఎలాంటి పోటీ లేదన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ఇప్పటికే ఎంతో ప్రగతి సాధించిందని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాల్సిన బాధ్యత మనందరి పై ఉందన్నారు. మంత్రి కేటీఆర్ సహకారంతో ఇప్పటికే కోనరావుపేట మండలంలో చాలా సమస్యలు పరిష్కారమైనట్లు చెప్పారు. ఈ మధ్య సుద్దాల–మంగళ్లపల్లి రోడ్డు నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఎంపీపీ చంద్రయ్యగౌడ్, వైస్ఎంపీపీ సుమలత, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గోపు పరశురాములు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు,కార్యకర్తలు, కులసంఘాల సభ్యులు పాల్గొన్నారు.



గోసిక మధు



జక్కని నవీన్

## పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మధు

కోనరావుపేట, అక్టోబర్ 13: జిల్లా కేంద్రంలో పీఆర్‌టీయూటీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోనరావుపేట మండలంలోని ఎగ్లాస్‌పూర్ పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న గోసిక మధు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా నాగారం ఉపాధ్యాయుడు జక్కని నవీన్ నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులకు మధు, నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

రుద్రంగి, అక్టోబర్ 13: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను విద్యార్థులు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పులి గంగయ్య విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఇక్కడ ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది ఉన్నారు.

## పనిచేసిన వారికి గుర్తింపు

ఇల్లంతకుంట, అక్టోబర్, 13 : నిస్వార్థంగా సేవలందించే ప్రతి ఉద్యోగికీ గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని ఎస్ఐ డీ సుధాకర్ తెలిపారు. రెండ్రోజుల క్రితం గంజాయి పట్టుకున్న కేసులో ఎస్పీ అఖిల్ మహాజన్ ఎస్ఐ సుధాకర్, కానిస్టేబుల్ తిరుపతి, మధులను అభినందించి, రివార్డులను అందజేశారు. ఎస్పీ ద్వారా రివార్డు తీసుకోవడం సంతోషంగా ఉందని ఎస్ఐ సుధాకర్ పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ కానిస్టేబుళ్లను అభినందించారు.

## తంగళ్లపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 13: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఇందిరానగర్‌కు చెందిన బూర స్వరూప బంధువుల వద్దకు వెళ్లి, శుక్రవారం రాత్రి ఇంటికి చేరింది. ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండి, ఇంట్లోని వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. రూ.20వేల నగదు, 8 తులాల వెండి అభరణాలు అపహరణకు గురైనట్లు స్వరూప ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు.

# పూల పండుగకు వేళాయే..

- తెలంగాణ పూల పండుగకు సర్వం సిద్ధం
- నేడు ఎంగిలిపూలతో సంబురాలు ప్రారంభం



రాజన్న ఆలయప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు(ఫైల్)

వేములవాడ టౌన్, అక్టోబర్ 13 : బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అని తెలంగాణ లోగిళ్లలో ఆడపడుచులు వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగ సంరంభం శనివారం ప్రారంభమవుతున్నది.

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా భావించే బతుకమ్మ పండుగను మహిళా లోకం తొమ్మిదిరోజులపాటు జరుపుకుంటుంది. ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి వాటిలో గుమ్మడిపువ్వులోని బొడ్డెమ్మను ప్రతిష్ఠిస్తుంటారు. ఎంగిలిపూలతో ప్రారంభమయ్యే బతుకమ్మ సంరంభం సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. బతుకమ్మలను పేర్చడానికి మహిళలు అధికభాగం తంగేడు పూలు, తామరపూలు, అల్లిపూలు, కట్లపూలు, గునుగు పూలు, గుమ్మడి పూలతో పాటు బంతిపూలు, చేమంతులు వినియోగిస్తారు. లభ్యమయ్యే పూల ఆధారంగా పలు వరుసల్లో అందంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చడం కనిపిస్తుంది. బతుకమ్మను కేంద్రంగా పేర్చుకున్న బతుకమ్మలతో సాయంత్రం వేళ పల్లెలు, పట్టణాల్లో దేవాలయాల కూడళ్లలో, చెరువుల చెంతకు పెద్దఎత్తున మహిళలు తరలివెళ్లి కోలాటాలు వేస్తూ ఆటపాటలతో ఆనందంగా గడుపుతారు. చిన్నా పెద్ద,కులం మతం తేడా లేకుండా మహిళలు,యువతులు బతుకమ్మలతో ఆడిపాడిన మహిళలు గౌరీ పూజల అనంతరం చెరువుల్లో, ఆలయాల వద్ద నిమజ్జనం చేస్తారు. గౌరీ పూజల తరుణంలో ముత్తయిదువలు ఇచ్చిపుచ్చుకునే వాయినాలకు విశేష ప్రాధాన్యతఉంటుంది. అంతేగాక వాయినాల అనంతరం గౌరీ దేవికి నైవేద్యంగా సమర్పించిన పలు రకాల ప్రసాదాలను పంచిపెట్టడం విశేషం. ఇక తొమ్మిదిరోజులపాటు జరిగే బతుకమ్మ పండుగకు నగరాలు, పట్టణాలు, ఊళ్లల్లో ఎవరికి వారు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

### వేములవాడలో ఏడురోజులే...

తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామి కొలువైన ఇక్కడ బతుకమ్మ పండుగను ఏడురోజులపాటు మాత్రమే జరుపుకుంటారు.14 వ తేది శనివారం నుంచి అక్టోబర్ 20 వ తేది శుక్రవారం వరకు ఏడురోజులపాటు బతుకమ్మ ఆడతారు. పట్టణంలో ఏవీధిలో చూసినా పూలజాతరే. మెట్టినింట బతుకమ్మ ఆడిన మహిళలు పుట్టినింట, పుట్టినింట బతుకమ్మ ఆడిన మహిళలు మెట్టినింట ఆడే సంప్రదాయాన్ని ఇక్కడ కొనసాగిస్తారని, ఇక్కడ ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ జరుపుకుంటారని ఇది అనాదిగా వస్తున్న ఆచారమని రాజన్న ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ వెల్లడించారు.

గంభీరావుపేట: కృష్ణమూర్తి యాదవ్‌ను పరామర్శిస్తున్న కొండూరి రవీందర్‌రావు



## బాధితుడికి 'కొండూరి' పరామర్శ

గంభీరావుపేట, అక్టోబర్ 13: మండలంలోని ముస్తాఫానగర్ బీఆర్ఎస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు మారవేని కృష్ణమూర్తి యాదవ్‌ను శుక్రవారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. జిల్లా కేంద్రంలో రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన కృష్ణమూర్తి యాదవ్‌ను వారి నివాసంలో పరామర్శించి ఆరోగ్య వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వీరితో ఏఎమ్‌సీ ఉపాధ్యక్షుడు గోగు లింగంయాదవ్ ఉన్నారు.